# నేడు స్టేషన్‌ఘన్‌పూర్‌కు ప్రగతి ప్రదాత

- నేడు ప్రజా ఆశీర్వాద సభకు రానున్న బీఆర్‌ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్
- శివారెడ్డిపల్లి శివారులో భారీ బహిరంగ సభ
- బీఆర్‌ఎస్ నాయకుల విస్తృత ఏర్పాట్లు



శివారెడ్డిపలిలో హెలిప్యాడ్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి కడియం శ్రీహరి

జనగామ, నవంబర్ 19 (నమస్తే తెలంగాణ) : గులాబీ దళపతి, ముఖ్యమంత్రి కేసీఆర్ సోమవారం మధ్యాహ్నం 12.30 గంటలకు స్టేషన్‌ఘన్‌పూర్‌లో నిర్వహించే ప్రజా ఆశీర్వాద సభకు రానున్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి పెద్దఎత్తున ప్రజలను తరలించేందుకు ఏర్పాట్లు పూర్తిచేశారు. సభను విజయవంతం చేసేందుకు బీఆర్‌ఎస్ శ్రేణులు ఇప్పటికే సన్నాహక సమావేశాలు నిర్వహించి భారీగా జన సమీకరణకు దిశానిర్దేశం చేశాయి. శివారెడ్డిపల్లి శివారులోని మైదానంలో జరిగే భారీ ఎన్నికల బహిరంగ సభకు సర్వం సిద్ధమైంది. వేదిక, సభా ప్రాంగణం, కుర్చీలు, లైటింగ్, షామియానాలు వంటి ఏర్పాట్లతో ముస్తాబైంది. సోమవారం కేసీఆర్ రాకను పురస్కరించుకొని సభా పరిసరాలు సర్వాంగ సుందరంగా, గులాబీమయమైంది. బహిరంగసభ ప్రాంగణం, వేదిక వద్ద ఎలాంటి లోటు రాకుండా అన్నీ సిద్ధం చేశారు. వేదిక నిర్మాణం, బారికేడ్ల ఏర్పాటు, గ్రౌండ్ చదును, లైటింగ్, సౌండ్ సిస్టమ్ వంటి ఏర్పాట్లు పూర్తయ్యాయి. కేసీఆర్ హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో నేరుగా 12.30 గంటలకు సభా స్థలికి చేరుకొని ప్రజా ఆశీర్వాద సభలో మాట్లాడుతారు. ఎన్నికల ప్రచారం దగ్గర పడుతున్న తరుణంలో జరిగే సభ రాజకీయ ప్రాధాన్యం నెలకొనే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. కాగా, సీఎం కేసీఆర్ రాక సందర్భంగా అవాంఛనీయ సంఘటలు చోటు చేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

### సీఎం కేసీఆర్ రాక కోసం ఎదురుచూస్తున్న జనం



'స్టేషన్‌ఘన్‌పూర్‌కుముఖ్యమంత్రి వస్తున్నందున ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. సీఎం కేసీఆర్ జనగామను జిల్లా కేంద్రం చేయడంతోపాటు స్టేషన్‌ఘన్‌పూర్‌ను రెవెన్యూ డివిజన్ కేంద్రంగా మార్చారు. వందలకోట్ల నిధులు ఇవ్వడంతో అద్భుతమైన అభివృద్ధి చేసుకోగలిగాం. దేవాదుల ఎత్తిపోతల ద్వారా అందుతున్న సాగునీరు వ్యవసాయాన్ని పండుగలా మార్చింది. సాగు, తాగునీటికి సమస్య లేదు. అధినేత చెప్పే మాటలు వినాలని ప్రజలు, రైతు కుటుంబాలు సొంత వాహనాల్లో వచ్చేందుకు సిద్ధమవుతున్నారని మా పార్టీ శ్రేణుల ద్వారా సమాచారం అందుతున్నది. బహిరంగ సభకు ఏర్పాట్లు కూడా ఆ స్థాయిలోనే చేస్తున్నాం.''

**– కడియం శ్రీహరి, బీఆర్‌ఎస్ స్టేషన్‌ఘన్‌పూర్ అసెంబ్లీ అభ్యర్థి**

### చరిత్రలో నిలిచిపోయేలా సభ..

రాఘువాపూర్-నష్కల్ గ్రామాల శివారులోని 50 ఎకరాల్లో స్టేషన్‌ఘన్‌పూర్ చరిత్రలో నిలిచిపోయేలా సభ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. జర్మనీ స్ట్రక్షర్ షామియానాలు, వేలాది మంది కూర్చునేందుకు వీలుగా కుర్చీలు, లక్షలాది మజ్జిగ, మంచి నీళ్ల ప్యాకెట్లు, అంబులెన్స్‌లు, వైద్య బృందాలు, వాహన పార్కింగ్ వంటి అన్ని ఏర్పాట్లు చేశారు. హెలిప్యాడ్ నుంచి సభాస్థలికి 5 నిమిషాల్లో చేరుకొని తిరిగి వెళ్లిపోయేలా హెలిప్యాడ్ నిర్మించారు. లక్ష మందికి పైగా సామర్థ్యం ఉన్న గ్రౌండ్‌లో బారికేడ్లు, షామియానాలు, టెంట్లు, మంచినీటి వసతి కల్పిస్తున్నారు. బందోబస్తు సహా వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలు, వీవీఐపీ, వీఐపీల వాహన పార్కింగ్ వంటి అంశాలపై పోలీసు అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

### ప్రజా ఆశీర్వాద సభకు లక్ష మంది..

స్టేషన్ ఘన్‌పూర్ : మండలంలోని శివారెడ్డిపల్లి వద్ద నేడు సీఎం కేసీఆర్ నిర్వహించే ప్రజా ఆశీర్వాద సభకు స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గం నుంచి స్వచ్ఛందంగా లక్షమంది తరలి వస్తారని ఎమ్మెల్సీ కడియం శ్రీహరి అన్నారు. ఆదివారం బహిరంగ సభ ఏర్పాట్లు, హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీసులకు ఆయన పలు సూచనలిచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్‌ను చూసేందుకు, వారి ప్రసంగాన్ని వినేందుకు పార్టీ శ్రేణులతోపాటు వివిధ వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున తరలి రానున్నారని వివరించారు. పోరాడి సాధించుకున్న రాష్ట్రంలో తొమ్మిదిన్నరేళ్లుగా చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో పాటు ప్రతి గ్రామంలో జరిగిన ప్రగతి కళ్లముందు కనిపిస్తున్నదన్నారు. సీఎం కేసీఆర్‌కు మద్దతు తెలుపాలని ప్రజలు ఎదురుచూస్తున్నారన్నారు. తనకు రాజకీయ జీవితాన్ని ఇచ్చిన ఈ నియోజకవర్గ ప్రజలకు సేవ చేసి, వారి కష్ట సుఖాల్లో పాలు పంచుకుని అభివృద్ధి చేయాలనే ప్రత్యేక ప్రణాళికతో ఉన్నానని ఆయన అన్నారు. ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓట్లేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కడియం శ్రీహరి ప్రజలను కోరారు. సోమవారం మధ్యాహ్నం 12.30 గంటల వరకు ప్రజలు బీఆర్‌ఎస్ శ్రేణులు, అభిమానులు సభాస్థలికి చేరుకోవాలని కోరారు.

# క్రిస్టియన్లకు అండగా రాష్ట్ర సర్కారు

- బీఆర్‌ఎస్ పాలనలో సర్వమతాలకు సమ ప్రాధాన్యం
- పేదరిక నిర్మూలనే సీఎం కేసీఆర్ లక్ష్యం
- ప్రజలు ఆలోచించి ఓటు వేయాలి
- ప్రభుత్వ చీఫ్ విప్, పశ్చిమ అభ్యర్థి దాస్యం వినయ్‌భాస్కర్

కాజీపేట, నవంబర్ 19 : రాష్ట్రంలోని క్రిస్టియన్ మైనార్టీలకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం, సీఎం కేసీఆర్ అండగా నిలుస్తున్నారని చీఫ్ విప్, పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. కాజీపేట పట్టణం 61వ డివిజన్ బాబుక్యాంప్‌లోని ఎక్లేషియా మినిస్ట్రీస్ చర్చిలో ఆదివారం ఆయన క్రైస్తవులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఎన్నికల్లో దాస్యం గెలువాలని బిషప్ డానియల్ కల్యాణపు ఆశీర్వదించారు. ఈ సందర్భంగా చీఫ్ విప్ మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం సర్వమత సమానత్వాన్ని కొనసాగిస్తున్నదన్నారు. రాజ్యాంగం అందించిన లౌకికవాద స్ఫూర్తి ప్రతిబింబించేలా గంగా, జమునా, తెహజీబ్‌ను మరోమారు సీఎం కేసీఆర్ ప్రపంచానికి చాటారన్నారు. క్రిస్టియన్ మైనార్టీలకు బ్యాంక్ లింకేజీ లేకుండా బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.లక్ష ఆర్థికసాయం అందించిందన్నారు. పేదరిక నిర్మూలనే లక్ష్యంగా సీఎం కేసీఆర్ ముందుకెళ్తున్నారన్నారు. మైనార్టీలందరు బీఆర్‌ఎస్ వెంటనే ఉన్నారని, రానున్న ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలని వేడుకున్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఎలకంటి రాములు, డివిజన్ అధ్యక్షుడు కోటిలింగం, నాయకులు నార్లగిరి రమేశ్, శ్యాం, సాంబయ్య, చర్చి కమిటీ సభ్యులు కందుకూరి సారయ్య, లింగమూర్తి, రాజు పాల్గొన్నారు.

### 'హరిత తెలంగాణ'గా తీర్చిదిద్దుకున్నాం..

హనుమకొండ చౌరస్తా : బీఆర్‌ఎస్ హయాంలో రాష్ట్రాన్ని హరిత తెలంగాణగా తీర్చిదిద్దుకున్నామని దాస్యం అన్నారు. కార్తీక మాసం సందర్భంగా వీరశైవ లింగాయత్ కులస్తుల సామూహిక వన భోజనం, ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన ఆయన మాట్లాడుతూ.. బసవేశ్వర జయంతి, వర్ధంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్నదని, హైదరాబాద్ కోకాపేటలో బసవేశ్వర భవన్ మంజూరు చేశారని తెలిపారు. తన సీడీఎస్ నుంచి బసవేశ్వర కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని చెప్పారు. అనంతరం కమిటీ సభ్యులు వినయ్‌భాస్కర్‌కు మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో నాన్నం రాజయ్య, మొగిళి, ఈశ్వరయ్య, సర్వేశ్వర్, వీరేశం, గౌరీశంకర్, కోటేశ్వర్ పాల్గొన్నారు. అలాగే చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ నగరానికి విచ్చేసిన త్రిదండి అహోబిలం రామానుజజీయర్ స్వామీజీ ఆశీస్సులు తీసుకున్నారు.

### మార్వాడీల సొసైటీకి అండగా..

హనుమకొండ చౌరస్తా : మార్వాడీల సొసైటీకి ప్రభుత్వం అండగా నిలుస్తోందని దాస్యం అన్నారు. దీపావళి ఉత్సవాల్లో భాగంగా రామ్ మందిర్‌లో జరిగిన కార్యక్రయంలో ఆయన మాట్లాడుతూ.. ట్రైసిటీలో చాలామంది మార్వాడీలు స్థిరపడ్డారని, వారికి ఎల్లప్పుడూ అండగా నిలుస్తున్నామని తెలిపారు. కాగా, వినయ్‌భాస్కర్‌కు మార్వాడీలు మద్దతు ప్రకటించారు.

### కార్యకర్తలను కాపాడుకుంటా...

హనుమకొండ చౌరస్తా : కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. హనుమకొండ జిల్లా బీఆర్‌ఎస్ కార్యాలయంలో 29వ డివిజన్‌లోని వివిధ పార్టీలకు చెందిన నాయకులు దత్తు ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్‌లోని అన్ని కమిటీల్లో ఇప్పుడు చేరిన వారికి ప్రాధాన్యం ఇస్తానని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం 10 సంవత్సరాల్లో గణనీయమైన అభివృద్ధి సాధించిందన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు కొడకండ్ల సదాంత్, నాయకులు ముత్యాల మహేందర్ పాల్గొనగా ప్రసాద్, శేషు, కిశోర్, కృష్ణ, దిలీప్ కుమార్, రాజుతో పాటు 50 మంది పార్టీలో చేరారు.



మార్వాడీల సమావేశంలో మాట్లాడుతున్న వినయ్‌భాస్కర్

# ప్రజలంతా బీఆర్‌ఎస్ వైపే..




ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డికి మద్దతు తెలుపుతున్న స్వర్ణకార సంఘం నాయకులు

- గడపగడపకూ సంక్షేమ పథకాలు అందించిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానిదే..
- కేసీఆర్ సీఎం అయితేనే మరింత అభివృద్ధి
- ఉమ్మడి రాష్ట్రంలో పరకాల అభివృద్ధి శూన్యం
- విపక్షాల మాటలు నమ్మి మోసపోవద్దు
- ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి
- పరకాలలో ఇంటింటా ప్రచారం

పరకాల, నవంబర్ 19 : రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు బీఆర్‌ఎస్ వైపే ఉన్నారని, రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్ హ్యాట్రిక్ విజయం ఖాయమని ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఉదయం పట్టణంలోని 1,2,12,13,14,15, 22 వార్డుల్లో, సాయంత్రం విలీన గ్రామాలు సీతారాంపురం, రాజీపేట (6,7,8 వార్డులు)లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొట్లాడి సాధించుకున్న తెలంగాణ సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో దేశానికే మార్గదర్శకంగా మారిందన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలతో పేద ప్రజల జీవన ప్రమాణాలు మెరుగయ్యాయని పేర్కొన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ అభివృద్ధిని పట్టించుకోలేదన్నారు. పగలంతా కరెంటు కోతలు ఉండేవని, దీంతో పలు వ్యాపారాలు మూతబడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం 24 గంటల కరెంటు ఇస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌దన్నారు. సీఎం అండతో పట్టణ రూపురేఖలు మార్చినట్లు తెలిపారు. వాడవాడల సీసీ రోడ్లు, ఇంటింటికీ మిషన్ భగీరథ నీరు, సెంట్రల్ లైటింగ్‌తో ప్రధాన రహదారులు. కార్పొరేట్ స్థాయిలో పాలనా భవనాలను నిర్మించుకున్నాని పేర్కొన్నారు. రెవెన్యూ డివిజన్‌ను తిరిగి పునరుద్ధరించుకున్నామని చెప్పారు. ప్రజలు విపక్షాల మాయ మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. గ్యారెంటీ లేని కాంగ్రెస్ ఆరు స్కీంల పేరుతో, ఓటు బ్యాంకు లేని బీజేపీ బీసీ కార్డులో ప్రజల ముందుకు వస్తున్నాయన్నారు. తెలంగాణ రాష్ట్రానికి బీఆర్‌ఎస్సే శ్రీరామ రక్ష అని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే 3గంటల కరెంటు మాత్రమే వస్తుందని, సంక్షేమ పథకాలు అన్నీ ఆగిపోతాయని, 24గంటల కరెంటు రావాలంటే ప్రజలంతా బీఆర్‌ఎస్‌కే ఓటు వేయాలన్నారు. పరకాలలో భారీ మెజార్టీతో గెలిపించి సీఎం కేసీఆర్‌కు అండగా నిలువాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనిత, మున్సిపల్ వైస్ చైర్మన్ రేగూరి విజయపాల్ రెడ్డి, మండలాధ్యక్షుడు మడికొండ శ్రీను, కౌన్సిలర్లు మడికొండ సంపత్‌కుమార్, ఒంటేరు సారయ్య, బండి రాణి, శనిగరపు రజిని, మార్క ఉమాదేవి, చందుపట్ల సుజాత, నాయకులు సోదా రామకృష్ణ, నిప్పాని సత్యనారాయణ, పావుశెట్టి వెంకటేశ్వర్లు, దగ్గు విజేందర్‌రావు, చందుపట్ల సాయి తిపుపతి రెడ్డి పాల్గొన్నారు.

### పలు సంఘాల మద్దతు..

ఎమ్మెల్యే చల్లాకు పట్టణంలోని పలు వర్గాలు మద్దతు తెలిపాయి. పట్టణ స్వర్ణకార సంఘం, పరకాల, నడికూడ మండలాల ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ అండ్ సీడ్స్ గుమస్తా సంఘం, ఆత్మకూరు మండలం నీరుకుళ్ల గ్రామానికి చెందిన మాల సంఘం, మేర సంఘం బాధ్యులు ఎమ్మెల్యేకు మద్దతు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో అన్ని కుల సంఘాలకు ప్రాధాన్యమిచ్చామన్నారు.